# మలేరియా - మన్మథుడు

పురుషులు ఎన్ని రకాలుగా వున్నారో, అన్ని రకాల భర్తలు కూడా వుండడానికి వీలుంది. అలా వున్న పలు రకాలలో, ఒక తక్కువ రకపు భర్త అయిన పురుషుడు ఈ కథకు ప్రేరకుడు.

అతని పేరు చంచల్ బాబు. అతను అనుకున్నంత తక్కువ రకం మనిషి కాదు. ఒక పెద్ద కంపెనీలో 'సేల్స్ ఆఫీసర్'గా పనిచేస్తున్నాడు. అందుకే నెలకు పది, పదిహేను రోజులపాటు అతను టూర్‌లో వుంటాడు. అతని ధర్మపత్ని గారిపేరు సావిత్రి. వారి వివాహమై దీర్ఘమైన ఐదు సంవత్సరాలు గడిచినా గూడా, ఇంత వఱకు, ఆమెకు సంతాన భాగ్యం కలుగలేదు. చంచల్ బాబుకు అలాంటి ఆలోచన ఏమీ లేదు. జీవితంలో పొందగలిగిన మధురానుభూతులన్నీ అతను అనుభవిస్తూ వస్తున్నా, ఇప్పటి వఱకు ఆ విషయంలో అతను ఇంకా ఎలాంటి సంతృప్తి స్థితికి రాలేదు. అతను పెద్ద త్రాగుబోతు ఏమీ కాదు. కాని, మిత్రులతో కలిసి ఉల్లాసం కోసం మధుసేవ చేయడం అతనికి ప్రీతికరమైన విషయం. అతని జీవితంలో వున్న అతి పెద్ద బలహీనత, అమ్మాయిలపై వున్న మోజు. కాని, అది బలహీనతకాదనీ తనకున్న విశేషమైన బలం అని వాదిస్తుంటాడు.

శ్రీకృష్ణ పరమాత్మకు, పదహారువేల ఎనిమిది మంది భార్యలు వున్నట్టు తెలుసుకున్న చంచల్ బాబుకు, తను సగం కృష్ణుడు లేదా కనీసం పావు కృష్ణుడయితే ఎంత బాగుండేదో అన్న గాఢమైన అభిలాష వుండేది. ఇప్పుడు ముప్పైమూడు సంవత్సరాలున్న అతను గత పదమూడు సంవత్సరాలలో ఈ శాఖలో తను సాధించిన విజయ పతాకాలు (విజయ పాతకీ?) ఇంకా వందకూడా పూర్తి కాలేదన్న విషయం తెలుసుకున్నాడు. పెళ్లికి ముందురోజు తను రెడీగా ఉన్నా కూడా, ఆ వినోదం అంత సులభమైనది కాదు కదా. ఇంతవఱకు తనకున్న ''ట్రాక్ రికార్డు'' చూస్తే ఇంక మిగిలిన జీవిత కాలంలో --- తనలో అశ్వశక్తి వున్నంత కాలం--- శ్రీకృష్ణుడితో దశాంశమైనా సంపాదించడం సాధ్యం కాదని ఒక నిట్టూర్పుతో అతను అప్పుడప్పుడు అనుకుంటూ వుండేవాడు.

ఇది అతని బలమో, బలహీనతయో... ఒక అమ్మాయిని అతను కొద్దిసేపు చూస్తూ నిలబడితే అతని మనసుకు ఒక మాదిరి మలేరియా జ్వరం వచ్చినట్టు వుంటుంది. చేయి చాపినంత సమీపంలో ఆ అమ్మాయివుంటే, మనసులోవున్న మలేరియా శరీరానికి గూడా సంక్రమిస్తుంది. విషయాలు ఇలా వున్నాకూడా, అతను ఇప్పటి వఱకు ఒక్క బలాత్కారం కూడా చేయలేదని వస్తుతః మాత్రం వాస్తవమే అని చెప్పవచ్చు. తన మంచి పేరుకు కళంకం తెచ్చే ఏ పనీ చేయడం అతనికిష్టం లేదు.

అతను ఎప్పుడు ఒక పరస్త్రీని ప్రేమించాడని ఇప్పటి వఱకు అతని సొంతభార్య సావిత్రికే తెలియదు. ఇంకా అతను ఒక స్త్రీ లోలుడుగా కాలేదు. ఆ విధంగా, ''జేమ్స్ బాండ్ ''కున్న కళాత్మక చాతుర్యంతో తన విషయ వాసనా పూర్తిని సాధిస్తూ వున్నాడు. చాలా తక్కువమంది ఆత్మ మిత్రులకు మాత్రమే, ఇతడి వివిధ కళాత్మక కార్యకలాపాలు గుఱించి తెలుసు. టూర్‌లో వుండేటప్పుడు తనను ఎవరూ గుర్తించరనే ధైర్యంతో చాలా ఫ్రీగా తిరిగేవాడు. డబ్బు ఖర్చు పెట్టే విషయంలో ఏమాత్రం వెనుకడుగు వేసేవాడు కాదు చంచల్ బాబు.

కాని, ఈ ముప్పై మూడేళ్ల వయసులో అతనికో కొత్త రోగం వచ్చినట్టుంది. అది ఒక రకమయిన మనోరోగం. తన జీవిత సరళిలో, ఒక పెద్ద తప్పు వుంది గదాని, ఒక అనుమాన గ్రహణం అతన్ని పీడించడం మొదలు పెట్టింది. కాని, స్వయంగా తన తప్పును దిద్దుకోవడానికి తాను సిద్ధమేనా? ఎంత ప్రయత్నించినా, అతని వల్ల కాని విషయం అది. రోజులు గడుస్తుంటే, అతనిలో ఆ ధర్మ సంకటం పెరుగుతూనే వచ్చింది. ఐదు సంవత్సరాల తర్వాత కూడా తనకు సంతానప్రాప్తి లేకపోవడం, తన పాపాల ఫలితంగానేనా? భార్యాభర్తలు వెళ్లి డాక్టరును సంప్రదించి, పరీక్షలన్నీ చేయించుకున్నారు. ఇద్దరిలో కూడా ఏలాంటి లోపాలు లేవు. మరి తప్పెక్కడుంది?

పోనీయండి. సంతాన ప్రాప్తికింకా కాచుకోవచ్చు. అంత వయసేమీ రాలేదు కదా? సావిత్రి కిప్పుడు ఇరవై ఆరే కదా?

అతన్ని ఎక్కువగా పీడించే విషయం వేరోకటుంది. జీవిత రసాస్వాదనం చేయడం అంటే మామూలు మనుషుల కంటే ఇంకా ఎంతో గొప్పగా సుఖభోగాలు అనుభవించే తన జీవన విధానం తప్పా? వివాహానికి పూర్వ జీవితం ఎలాగున్నా పరవాలేదు. అప్పుడు ఎవరికీ కూడా లెఖ్ఖ చెప్పే అవసరం వుండేది కాదు. కాని, పెళ్లి జరిగి ఇంతకాలం తర్వాత కూడా, అచ్చోసిన ఆంబోతు మాదిరి స్వైర విహారం చేయడం బాగుంటుందా? తను చేసేది విశ్వాస వంచన కాదా? తను ప్రవర్తించినట్టు, తన భార్యకూడా తిరిగితే తనకు బ్రతికి వుండడం సాధ్యమేనా? తన జీవితంలో ముక్కుతాడు ఎప్పుడు కూడా వేసుకోకుండా వుండడంవల్ల తనపైన దేవుడికి కోపం రాదా?

కాని దేవతల రహస్య జీవిత వివరాలు దాదాపుగా తెలుసుకున్న చంచల్ బాబుకు ఈ విషయంలో వారికి తనపై 'దైవకోపం' వస్తుందని భయమేమీ లేదు. ఏక స్త్రీతో తృప్తి పొందిన హిందూ దేవుడు ఎవడున్నాడు? సాక్షాత్ దేవేంద్రడయితే, లెక్కలేనంత మంది సుందరీ మణులతో రతిసుఖం అనుభవించిన తర్వాత కూడా, పాపం అహల్యను గూడా మోసం చేయడానికి కుక్కుట వేష ధారణం చేయలేదా? శ్రీ చంద్రశేఖరుడయితే తన ప్రాణ మిత్రుడయిన నారాయణుడు ఒకసారి మోహిని వేషంలో వుండడం

చూసి మోహితుడై ఆయనతో రతికేళి సలపలేదా? వాలీ - సుగ్రీవుల జనన మర్మాలేంటి?

అదంతా వదిలేయండి. సకల చరాచరులను సృష్టించిన ఆ సర్వశక్తులు గలవాడే గదా తనను, తన వికారాలను సృష్టించింది? ప్రతి రాతిలో, ధూళిలో, ఉపస్థితుడైన ఆ జగత్కారకుడి ప్రభావం లేకుండ, ఈ లోకంలో ఏదైనా చలిస్తుందా. గాలి గతిని నియంత్రించేది, ఆ జగదీశ్వరుడే గదా. మనిషి ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో కూడా, ఆ ఓంకార స్వరూపుడి హ్రీంకార నాద కెరటాలు వెలువడడం లేదా? మానవుడిది గాని లేదా మృగానిది గాని ఏదైన ఒక నాడి ప్రవర్తించాలంటే, ఆ సర్వేశ్వరుడి శక్తి దాని వెనక వుండి తీరాలి గదా! మానవుడు ఈ లోకంలో స్వయం భువుగా పుట్టగలడా? వాడు తన మృత్యు సమయాన్ని ఒక నిముషంపాటైనా వాయిదా వేసుకోగలడా? మానవుడి ప్రతి కదలిక, చింత, వికారం దైవదత్తమే కదా! ''మ్యాన్ ప్రపోజెస్ గాడ్ డిస్పోజెస్'' అని ఇంగ్లీషులో చెప్పినట్టు, మానవుడు అనుకున్న కార్యాలు అనుకున్నట్లు జరుగుతాయా? మానవుడు అనుకున్నదంతా జరిగితే అసలు దేవుడే వుండడు. జరిగిపోయిన విషయాలు గురించి విచారిస్తూ కూర్చుంటే మనిషికి మనఃశ్శాంతి వుండదు. అందువలన, జరిగినవి, జరుగుతున్నవి, జరుగబోయేవి అన్నీ దైవేచ్ఛ ప్రకారంగానే వున్నాయని మానవుడు తెలుసుకోవాలి. అది అతను తెలుసుకోకపోతే, దానిగ్గూడా కారణం ఆ దేవుడే. మానవుని సర్వస్వం. సర్వవ్యాపి అయిన, ఆ దేవుడి పాదార విందాలకు అర్పించి, మోక్షప్రాప్తి పొందడమే యుక్తం. మనకు దొరుకుతున్న ప్రతి వస్తువు దేవుడు తెలిసే మనకు ఇస్తున్నాడు. ప్రతి ప్రవృత్తి దైవ కల్పితమే. గత జన్మలఫలమే, ఈ జన్మలో మనం అనుభవిస్తున్నప్పుడు, ఈ జన్మ పైన నాకున్న నియంత్రణ ఎంతవరకు? ఏదయినా, అనుభవించే యోగముంటేనే, అనుభవప్రాప్తి జరుగుతుంది.

ఇవన్నీ ఎలా వున్నా, చంచల్ బాబును పీడించే సమస్య వేరే ఒకటి వుంది. దేవుళ్లెలా వున్నా, తాను చేసే ప్రతి పనికి దేవుడి అనుగ్రహం వున్నాకూడా, పతియే ప్రత్యక్ష దైవం అని నమ్ముతూ బ్రతుకుతున్న, తన సతీమణికి తాను చేసేది ఘోర ద్రోహం కాదా? విశ్వాస వంచన కాదా? అనే ఒక అపరాధ భావం అతని మనస్సులో క్యాన్సర్ వ్యాధి మాదిరి వుంది. ఆరోగం అనుదినమూ పెరుగుతున్నదా, అన్న భయం కూడా అతనికి పెరుగుతూనే వచ్చింది. పాపకృత్యం అని కొందరు విశేషమైన కొన్ని సుఖదాయక కర్మలలో దిగేటప్పుడు, అతని మనసు తెరమీద, అతని సాధ్వీమణిగారి నిష్కళంక వదనం ప్రత్యక్షమయ్యేది. సొంత భార్యను వీక్షిస్తున్నప్పుడు, ఒకరకమైన ''అపకర్షతా బోధం'' అతనిలో ఉయించడం మొదలయింది. ఆ దివ్య స్త్రీ చుట్టూ ఒక ప్రకాశ వలయాన్ని దర్శించడం కూడా మొదలయింది - కుష్ఠురోగి, సన్యాసీ అయిన తన భర్తను మోసుకొని, అభిసారికా నిలయానికి దారితీసిన సుమతి చిత్రం

అతని మనోఫలకం మీద అంకురించింది. తన జీవితానికి భారమైన రోగగ్రస్తుడైన భర్త చనిపోకుండా, సూర్యుడినే ఉదయింప చేయకుండా ఆపగలిగిన శక్తి ఆ కులాంగన పాతివ్రత్య శక్తి. చనిపోయిన సత్యవంతుణ్ణి యమధర్మరాజు నుంచి తిరిగి తెచ్చుకున్న పాతివ్రత్య శక్తి సావిత్రిది. తన వామభాగం పేరు కూడా సావిత్రేగదా! తనకు సత్యవంతుని గుణగణాలు ఒక్కటికూడా లేవే. తన భార్యా రత్నానికి, పురాణ కాలపు సుమతి, సావిత్రుల శీల బలముంటుందా? తన దౌర్బల్యాల గుఱించి, సావిత్రికి తెలిస్తే, సూర్యుణ్ణి ఉదయింపజేయకున్నా, కనీసం ఇంట్లోవున్న విద్యుద్దీపాలు వెలగకుండా చేస్తే, ఇంటి అంధకారంతోపాటు, తన భవిష్యత్తు గూడా అంధకార పూరితం కాదా?

రోజులు గడుస్తుండగా, అతనికి సొంత ఇంటిలోనే, జీవితం దుర్భరమని అనిపించింది. ప్రకృతి రీత్యా మితభాషిణియైన సావిత్రిలో మనుష్య రూపం కరువై దివ్యరూపమే అతనికి గోచరమవుతుంది. ఆ స్త్రీతో మాట్లాడాలన్నా అతనికి భయమేస్తుంది. అయ్యో! ఈ మధ్యకాలంలో ఆ దేవి నవ్వడం కూడా లేదే! దేవుడా! ఇలాంటి దివ్యరూపంతో సంసారం చేసేదెలా?

చంచల్ బాబుకు తన జీవితం పైనే ఒకరకం విరక్తి పుట్టింది. తనతో అప్పుడప్పుడూ పోట్లాడే ఒక సాధారణ స్త్రీ తనకు భార్యగా లభించి వుంటే ఎంత బాగుండేది? ఈ దివ్య స్వరూపిణితో, సాధారణ మానవుడైన తాను, ఇంకా ఎంతకాలం సంసారం చేయాలి? ఆమె పాతివ్రత్య శక్తితో ఏనాడు తను కాలి మసైపోతానో, అని అతనిలో భయం పెరిగింది. అతనికి పిచ్చి పట్టినట్లు అనిపించింది. చికిత్స చేయని ఆ పిచ్చి రోజ రోజుకూ పెరుగుతూనే వుంది.

చివరకు, ఆ సమస్యను ఇంకా అపరిష్కృతంగా వుంచడం సాధ్యం కాక, తన ప్రాణ స్నేహితుడైన మాధవరావుతో ఒక ప్రతిపాదన చేశాడు. మాధవరావు ఆ కుటుంబంలో ఒక నిత్య సందర్శకుడయినా కూడా, సావిత్రితో ఎంత దగ్గరగా వున్నాకూడా, చంచల్ బాబు జీవిత రసాస్వాదనా ప్రక్రియలలో చాలావరకు భాగస్వామిగ వున్నాడు కూడా. వాళ్లిద్దరి మధ్యలో రహస్యాలేమీ లేకున్నా గూడా, ఇద్దరి శరీరాలు వేరైనా మనసు ఒకటిగా మెలిగినా చంచల్ బాబు ధర్మసంకటం గురించి వినగానే అతనికి నమ్మలేని ఆశ్చర్యం కలిగింది. అన్ని రహస్యాలు తనతో పాలుపంచుకున్న, తన ప్రియ మిత్రుడికి, ఇంతటి హృదయమర్దితమైన ఒక అనవ్యావస్థ ఎప్పటినుంచో పీడిస్తున్నదని తెలియగానే మాధవరావు కొయ్యబారిపోయాడు. తన మిత్రుణ్ణి మామూలు స్థితికి తిరిగి తీసుకురావడానికి, ఈ లోకపు వాస్తవాలను గురించి, బాగా తెలియజేయడానికి ప్రయత్నించాడు. కాని, ప్రయోజనం శూన్యం. భయగ్రస్తుడయిన ఒక భర్తను అది కూడా తన భార్య ఒక భగవతి అని నమ్ముతున్న, ఒక అమాయక పురుషుడిని, ఒక మామూలు మనిషిగా

తిరిగి తీసుకురావడానికి మాధవరావు తనకు తెలిసిన మెళుకువలన్నీ ఉపయోగించి చూశాడు. అంతా నిష్ఫలం. అయితే, ఈ చంచల్ బాబు విచిత్రమైన ఆ అభ్యర్థన విని మాధవరావు ఉలిక్కి పడ్డాడు. తన మిత్రుడు నిజంగా పిచ్చివాడేమో అని అతనికి ఒక గట్టి అనుమానం పుట్టింది.

చంచల్ బాబుకు సావిత్రి యొక్క పాతివ్రత్యం మీద ఉన్న సంతోషం కంటె ఆ పాతివ్రత్యాగ్నిలో తను కాలిపోతాడేమో అన్న భయం ఎక్కువ. ఒక వేళ అలా జరగకున్నా ఆ అనన్యత భీతి వల్ల, ఏదైనా ఒకరోజు పిచ్చాసుపత్రిలో అంతేవాసిగా వుండవలసి వస్తుందేమో అని అతను ఏడ్చాడు. స్వంత భార్య కళ్లలోకి లేక ముఖంలోకి సూటిగా చూడటానికి కూడా ధైర్యం లేనప్పుడు, ఆమె భర్తగా బ్రతికి ఏమి ప్రయోజనం?

సరే, సరే.

కానీ ఇందులో మాధవరావు ఏం చేయాలి? అతని ఆలోచన చెప్పగానే మాధవరావు ఉలిక్కి పడ్డాడు.

చంచల్ బాబు కంపెనీ కార్యకలాపాలపై ఒక పదిరోజుల పాటు కలకత్తా వెళ్తు న్నాడు. ఆ ఇంటిలో దాదాపు నిత్య సందర్శకుడైన మాధవరావు ఆ పదిరోజులు, కొంచెం ఎక్కువ సమయం సావిత్రితో గడిపి, ఏదైనా ''నయతంత్ర పూర్వక సామీప్యాల''తో ఆమెకు పాతివ్రత్య భంగం కావించాలి.

''ఒక్కసారి - ఒకే ఒక్కసారి - ప్లీజ్ - ఫార్ మై సేక్''

మాధవరావు కళ్లు బయటకు పొడుచుకొచ్చాయి. దీర్ఘ వాగ్వివాదాల తర్వాత కూడా, చంచల్ బాబు నిలకడకు ఎలాంటి వ్యత్యాసం కలుగలేదు. అది మాత్రమే కాదు, అతను మాధవరావు చేతులు పట్టుకొని, ఒక చిన్న పిల్లవాడి మాదిరి వెక్కి వెక్కి ఏడ్వడం మొదలుపెట్టాడు. గత్యంతరం లేక, కావలసినది చేస్తానని మాధవరావు అతనికి మాట ఇచ్చాడు. దానితో చంచల్ బాబు ఏడుపు ఆగింది - మాధవరావుకు గుండెలో దడదడ మొదలయింది.

చంచల్ బాబు కలకత్తా వెళ్లాడు. మాధవరావు సావిత్రితో చాలా దగ్గరగా వుండడం వల్ల, తన మిత్రుడి, ఆధునిక చిత్తరోగం గురించి వివరించాడు. ఇద్దరూ కలసి చాలా సేపు నవ్వుకున్నారు. తరువాత చంచల్ బాబు యొక్క విశేష అభ్యర్థన గురించి మెల్ల మెల్లగా చెప్పేశాడు. మామూలుగా ఆయనతో చాలా ఫ్రీగా మాట్లాడే అలవా టున్న సావిత్రి, ఆ మాట వినగానే లేచి నిలబడి నవ్వుకొని చెప్పింది - ''గుడ్ నైట్ చెప్పడానికి టైం అయిందని అనుకుంటున్నాను, రేపు కలుద్దాం''.

ఇంక ఒక నిముషం కూడా ఆలస్యం చేయకుండా అతను కూడా గుడ్ నైట్ చెప్పి వెళ్ళిపోయాడు.

మరుసటి రోజు సాయంత్రం స్నేహితులతో కూర్చుని రెండు, మూడు పెగ్గుల విస్కీ సేవించిన తరవాత మాధవరావు, సావిత్రి ఇంటికి ఎనిమిదిన్నరకు చేరాడు.

''అహ! మంచి కండిషన్‌లో వున్నారే'' అని చెబుతూ, నవ్వుతూ స్వాగతం పలికింది సావిత్రి.

''ఎక్కువేమీ తీసుకో లేదండి. ఎంత తాగినా కూడా, ఒక రోజైనా, నా ప్రాణమిత్రుని, అతని సతీమణిని నేను మరచిపోగలనా?'' అని చెబుతూ అతను లోపలికి వచ్చేశాడు.

తరవాత ఒక గంట పాటు మంచి రసవత్తరమైన సంభాషణ జరిగింది. ఒకరికి తన మిత్రుడిపట్ల వుండవలసిన బాధ్యత, ఒక పతివ్రతకు భర్త ఆజ్ఞను సంతోష పూర్వకంగా శిరసావహించడం, అంటూ మొదలు పెట్టి, పురాణాల గురించి, పాశ్చాత్య జీవిత విధానాల గురించి వాళ్ళిద్దరి మధ్య వాదోపవాదాలు జరిగాయి. కుంతీ దేవికి, పాండు మహారాజు అనే ఒక భర్త వున్నా, పరపురుషుల సహాయం అర్థించడం ఎలా అవసరమయింది? పెళ్ళికి ముందే రవి ద్వారా దొరికిన కర్ణుడిని కర్ణాకర్ణిగ ఇతరులకు తెలియకుండా, జల మార్గంలో దూరం చేయడమూ, సాక్షాత్ సత్యహరిశ్చంద్రుడు తన భార్యను అమ్మిన విషయమూ, మనుష్యుల్లో కామం ప్రేరేపించే మన్మథుడి కొంటె తనమూ, ఇలాంటివెన్నో వారి చర్చా విషయాలు అయ్యాయి.

తత్ఫలితంగా -

పాతివ్రత్య భంగం జరిగింది.

మాధవరావు తన ఇంటికి పదిగంటలకే చేరుకున్నాడు.

ఒకసారి భంగమైన తరువాత, ఇంకెప్పుడూ ఆశాభంగం కలుగదు కదా!

పదిరోజుల కలకత్తా ప్రయాణం తరవాత తిరిగి వచ్చిన చంచల్ బాబు, తన ఇంటికి పోకుండా ప్రాణస్నేహితుడైన మాధవరావు దగ్గరకే వెళ్ళాడు.

మాధవరావు, అతి క్షీణావస్థలో కనిపించాడు. అత్యాకాంక్షతో, వివరాలు గురించి, అడిగిన ఆ భర్తతో మాధవరావు ఇలా చెప్పాడు -

''నన్ను ఈ హోమ గుండంలో దించకుండా వుంటే బాగుండేది. ఈరోజు నేను బ్రతికి వున్నానంటే అది నీ అదృష్టం వల్లనే అని అనుకో. సావిత్రిని తిప్పుకోవడానికి నేనెన్నో ప్రయత్నాలు చేశాను. ఆమె నన్ను చంపడానికి గాని, కొట్టడానికి గాని రాలేదు, కాని, మంచి హితోపదేశం ఇచ్చింది. అది చాలదా! అసలు నేను ఆత్మహత్య

చేసుకోవాలసింది. అంత దహించుకపోయాను. కాని, ఆమె ఎంత మంచిది. ఆమె ఒక దేవత. ఈ లోకంలో ఏ మానవుడికయినా దేవలోకంలోని ఏ దేవుడికయినా ఆమె దగ్గరక్కూడా రావడానకి సాధ్యం కాదు. మరీ దగ్గరకు పోతే కాలి బూడిదైపోతాడు. నీవెంత అదృష్టవంతుడివిరా! ఈ యుగంలో ఇలాంటి స్త్రీని ఇంత శక్తిగల ఒక పతివ్రతను దర్శనం చేసుకోవడం కూడా మహద్భాగ్యమే. ఒక విషయం గురించి నాకు పూర్తి నమ్మకముంది. నువ్వు చచ్చిపోతే, ఆ చితిమంటల్లో ఆమె కూడా ఆత్మాహుతి చేసుకుంటుంది. ఒక రకంగా దాని అవసరం కూడా పడదేమో. ఆమె ఎంత నిర్మలమైనది, ఎంత పావనమైనది అంటే, నువు చనిపోయిన మరుక్షణంలో ఆమె ప్రాణం త్యజిస్తుంది. దేవుడా! ఇలాంటి శ్రీలక్ష్మి ఈ కాలంలో ఎక్కడయినా వుంటుందా! ఏమైనా గూడా నువు భయపడవద్దు. నీ గురించి నేను ఏం చెప్పలేదు. తొందరగా ఇంటికి వెళ్లు . ఆమె నీకొరకే ఎదురు చూస్తుంటుంది. ఈ విషయాన్ని గురించి ఏమైనా తెలిసినట్టు నీవు భావించవద్దు... ఆల్ ది బెస్ట్.''

చంచల్ బాబు తరువాత ఎప్పుడు కూడా ఆ గట్టి నిర్ణయం నుండి, ఒక్క అడుగు కూడా వెనుకకు తీసుకోలేదు. ''సావిత్రియే శరణం'' అని అనుకొని ఆ పతివ్రతా రత్నాన్ని తన ఆరాధ్య దేవతగా చేసుకొని ఆమెతో సుఖంగా ఎంతోకాలం బ్రతికాడు.

కాని, సావిత్రి, మాధవరావుల రహస్య సంయోగ సందర్భాలు ఎప్పుడు జరిగినా కూడా మన్మథుడి గుప్తాస్త్రాలు వాళ్లపై పడడం మాత్రం ఖాయం.''

---